# మ్రొక్కక వరమిచ్చే వేల్పు

రాజ్యం కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి. చేతిలో కాగితం రెప రెపలాడుతోంది. తన చిన్న తమ్ముడి మాటలు చెవుల్లో గింగురు మంటు న్నాయి. చిన్న స్కూల్లో వాడ్ని చేర్పించినపుడు ఎంతో ముద్దుముద్దుగా పాటలు, పద్యాలు చెప్తూ వుంటే మురిసిపోయింది తనే! వాడు హైస్కూలుకి వచ్చాక ప్రోగ్రెస్ రిపోర్టుమీద సంతకం చేస్తూ మురిసి పోయిందీ తనే. వాడు నూనూగు మీసాలతో, నిగనిగలాడే బుగ్గల్తో మెరిసిపోతుంటే వాణ్ణి కన్నార్పకుండా చూసి ఆనందపడి పోయిందీ తనే_ అవును తనే మరి. తండ్రి అనుకోకుండా హఠాత్తుగా మరణిస్తే ఆ తండ్రి చేసే చిన్న ఉద్యోగం తను చెయ్యాల్సి వచ్చింది తమ్ముడు చిన్నవాడు కనక. అంతేకాదు, తమ్ముడు చెయ్యాల్సిన పనులన్నీ తనే చేసింది, తను అక్క కనక. రాజ్యం చేతిలో కాగితం వంక అలానే చూస్తోంది. వీధిలో తలుపు కొడుతున్నారెవరో....ఎవరూ రాజయ్య.

"అవును రాజయ్యా నువ్వు నెలకి ఒకసారి వస్తావా మా యింటికి_ నిన్న మొన్న నీ గురించి ఆలోచించాను" రాజ్యం ముఖం కంఠీరంగానే వుంది. ఈ రాజ్యం అమ్మాయిని ఎప్పటి నుంచి ఎరుగు న్నాడూ_ ఆ అమ్మాయి మూడేళ్ళ అమ్మాయిగా వున్నప్పటినుంచి.

"నెలరోజు లేమిటమ్మా.... పదిరోజులయింది. నా భార్యకి ఒంట్లో బాగుండక రాలేదు. నా మనసు తెగ ఇదయిపోతోంది రెండు రోజుల్నుంచి, నిన్న కలలో నాన్న కనిపించి–" రాజయ్య ఏదో అంటున్నాడు. రాజయ్య అటు ఇటు చూస్తున్నాడు. అమ్మాయి ముఖంలోకి చూశాడు. తను వచ్చినప్పుడల్లా కనిపించే రాజ్యం కాదు ఈ రోజు కనిపిస్తున్నమ్మాయి!

రాజయ్యకి ఆ ఇంటి పరిస్థితులు చాలా వరకు తెలుసు. రాజ్యం తండ్రి పోవటం, ఆ కుటుంబ బాధ్యత ఆ అమ్మాయి నెత్తిన పడటం, తమ్ముడు ఇప్పుడు ఇంజనీరింగు పాసయి విదేశాలకి వెళ్ళిపోవటం కూడా తెలుసు.

"రాజయ్యా....నాకు–" రాజ్యం గొంతు దాటి మాట బయటకి రాలేదు. రాజయ్య తనకి ఏం సహాయం చేయగలడు? అయినా రాజయ్య స్థితి ఎంతని? తండ్రి ఆపీసులో ప్యూను చేసి రిటైరయ్యాడు ఏడాది నాడు. కానీ ఏమిటో అనుబంధం. వారం, పది రోజులకి వచ్చి అమ్మని, తనని చూస్తే కాని తోచదు రాజయ్యకి. ఎందుకో మరి!

నాలుగు రోజులుగా మనసు మనసులో లేదు. ఆ నగ పోతే తనకి విచారం లేదు. కానీ పోకూడదు. అది తండ్రి తన కోసం చేయించింది. పైగా అది తన చేతికిస్తూ, "అమ్మా రాజీ, ఇది నీ కోసం ప్రత్యేకంగా వెళ్ళి నేను సెలక్టు చేశాను. ఎందుకంటే నగలపైన వ్యామోహం ఆడపిల్లకి ఉండాలా, ఉండకూడదా అనే విషయం అలా వుంచి, నగలు ఆడపిల్లకి అత్యవసర పరిస్థితిలో ఉపయోగిస్తాయి.... నువ్వు రేపు ఏ విదేశాలకో చదువులకి వెళ్ళిపోతావనుకో, ఈ బీదనాన్న వెంటనే ముప్పైవేలు నీ అవసరానికి కావాలంటే ఇవ్వలేడనుకో, ఈ కాస్త డబ్బు ఆ నిముషం చాలా అవసరమైతే, అప్పుడు నువ్వు ఎవ్వరిమీద ఆధారపడకుండా ఇది బాంక్‌లో పెట్టి డబ్బు తెచ్చుకోవచ్చు...."

"ఏమిటి నాన్నా ఆ మాటలు.... మీరు బీదనాన్న కాదు– నేను ఈ

ఊళ్ళో చదువే చదువుకుంటాను. ఈ పెద్ద గొలుసు బాంకులో ఎప్పుడూ పెట్టి డబ్బు తెచ్చుకోను" రాజ్యం ఆ మాటలంటూ తండ్రి కష్టార్జితంతో కొన్న పెద్ద గొలుసు మెడలో వేసుకుంది— ఆ దశ్యం కళ్ళముందు కదులుతూ, ఆ మాటలు మారు్రమోగుతుంటే, అప్రయత్నంగా రాజ్యం కళ్ళొత్తుకుంది.

ఎదురుగా రాజయ్య నేలమీద కూచుని, పేపర్లో సినిమా బొమ్మలు చూస్తూనే అమ్మాయిగారి ముఖాన్ని గమనిస్తున్నాడు. 'అమ్మాయిగారు ఏదో పెద్ద యిబ్బందిలో వుంది. అడిగితే చెప్పదు. అమ్మాయి మనసు బాధపడుతుంటే నాకేం పట్టనట్టు వెళ్ళిపోవటమేనా? తన చిన్నమ్మాయిని అల్లుడు ఇంట్లోంచి వంపేసి ఇంకొర్తిని తెచ్చుకుంటే, పెద్ద మనుష్యుల్ని పిలిపించి వ్యవహారం అయ్యగారు చక్క పెట్టలేదా— మరి!!' రాజయ్య అమ్మాయివంక చూస్తున్నాడు.

"అమ్మా, చినబాబు అక్కడనుంచి ఉత్తరం రాస్తున్నాడా—"

రాజ్యం ఒక నవ్వు నవ్వింది....

"అక్కా, నాకు ఇప్పుడే మూడు వేల డాలర్లు— అంటే ఎంత డబ్బో తెలుసా.... ఏడాది తిరక్కుండా నీవు చేసిన అప్పులు, అదేలే నా కోసం, నా చదువు కోసం చేసిన అప్పులు తీర్చేస్తాను. అక్కా, నాన్న నీకు కొని పెట్టిన ఆ పెద్ద గొలుసు, నా కోసమేగా బాంక్‌లో పెట్టావు. అది తెచ్చి నీ మెడలో వేయకపోతే చూసుకో....నువ్వే నాకు అమ్మవి, అక్కవి, గురువువి, దైవానివి.... శేఖరం ఆరోజు ఎంత ఉత్సాహంగా, ఉద్రేకంగా మాట్లాడాడో గుర్తొచ్చి నవ్వొచ్చింది రాజ్యానికి.

"ఏమిటండీ, నవ్వుతారు?...."

"లేదు రాజయ్యా! ఇప్పుడు ఉత్తరాలు రాయటం మానేశాడు, ఫోను చేస్తాడు .... పక్కింటివాళ్ళు లేరుగా .... ఫోను చేసినా నాకు తెలియదు".... రాజ్యం లోపలకెళ్ళి, కప్పుతో టీ తెచ్చి, తాగు అంది.

రాజయ్య ఈ ఇంటికి వచ్చినపుడల్లా టీ తాగుతాడు, ఇంకా

పొద్దెక్కేవరకు కూచుంటే అన్నం తింటాడు. కాసేపు నిద్రపోతాడు.... నెమ్మదిగా సాయంత్రం వెడతాడు ఇంటికి .... ఈ రోజు ఎందుకో ఇంటి వాతావరణంలో మార్పు కనిపించింది రాజయ్యకి. లోపల ముసలమ్మ ఏదో గొణుక్కుంటోంది .... రాజ్యం చెల్లెలు, బాలింతరాలు గదిలోనించి బయటకు రాలేదు.

రాజయ్య మనసు ఎందుకో బాధ పడింది .... ఎందుకు, ఏమో!! అమ్మాయిగారు ఏదో దాస్తున్నారు. తను ఈ ఇంట్లో ఎవరికీ ఏమీ కాదు, అయితే మాత్రం .... కష్టం చెప్పుకుంటే చేతనయితే సాయం చేస్తాడుగా. అయ్యగారు తనని ఎంత ప్రేమగా చూసేవారో తను మర్చిపోతాడా? మనిషికి విశ్వాసం వుండదా? మరోరి కష్టంలో ఆదుకోవద్దా? తనకి ఈ ఇంటివాళ్ళపై అభిమానం, గౌరవం, ప్రేమ లేవా? రాజయ్య అటు ఇటు చూసాడు .... ఇంట్లో ఎవరి పనులలో వాళ్ళున్నారు.

"ఏమే మామయ్య దగ్గర నుంచి డబ్బు రాలేదుగా? పోనీ మరి బాబాయికి పక్కింటి నుంచి ఫోను చేసి చెప్పు. లేకపోతే అంత ఖరీదయిన వస్తువు పోగొట్టుకుంటామా?" .... తల్లి గొంతు పెంచింది.

"అమ్మా! .... ఇంక దాన్ని నేను కాపాడుకోలేను. ఎన్నిసార్లు! ఎందరి అవసరాలకి ఆ పెద్ద గొలుసు ఉపయోగపడింది. ఇంక చాల్లే! పోనీ .... ఇంక .... ఆ బాంక్‌వాళ్ళు తాకట్టు పెట్టక తప్పదు .... మా మామయ్య గొప్పవాడే, మా బాబాయి గొప్పవాడే .... అందరికన్నా నా తమ్ముడు మరీ గొప్పవాడు .... పోన్లే .... అది పోతుందని కాదు కానీ, నాన్నగారు కష్టపడి చేయించినది .... అదీ బాధ" ....రాజ్యం గొంతులో ఏడుపు!!....

రాజయ్య గదిలోనే కూచున్నాడు. రాజ్యం ఇందాక చేతిలో చూస్తున్న కాగితం, బల్లమీదే వుంది. ఇందులో ఏముందో తెలుసుకోవాలి ...అమ్మాయిగారు ఇందాకనుంచి ఈ కాగితం చేతిలోంచి వదిలి పెట్టటం

లేదు .... అటు ఇటు చూసాడు రాజయ్య. ఆ కాగితం చేత్తో పట్టుకుని గబ గబా బయటికి నడిచాడు.

తనకి చదువు రాదు. అయితే ఏం కొంప మునిగింది! తన ఇంటి ఎదురుగా రాంబాబు లేడూ ...చదువుకున్నవాడేగా? రాజయ్య సైకిలెక్కి పరిగెత్తాడు.

రాంబాబు ఆ కాగితం చూసి పక పకా నవ్వాడు. "నువ్వేం చేయ గలవ్? ఇది బాంక్ నోటీసు! రెండు రోజుల్లో కట్టకపోతే ఆ వస్తువు గోవిందా .... అంతే! దాన్ని వేలం వేసేస్తారు."

"వేలం వేస్తారా!" రాజయ్య ఆశ్చర్యంగా అన్నాడు.

"ఇంకా చదువు" ....

"ఇంకేం లేదు .... అదే విషయం .... " రాజయ్య రాంబాబు చేతిలో కాగితం తీసుకున్నాడు .... ఇరవై వేలు!!

అయ్యగారు తనని చాలా ప్రేమగా చూసేవారు. అమ్మాయిగారు, ముసలమ్మగారు తనని ఎంతో ప్రేమగా ఈ రోజుకి చూస్తున్నారు .... తన పెద్దమ్మాయిని పురిటికి తెస్తే అమ్మగారు ఎన్ని రకాల సాయం చేసారో తనకి? .... అయినా ఒకరి సాయంతో తనకి సంబంధం లేదు .... మనిషి అయ్యాక మరో మనిషికి ఆపదలో సాయం చేయాలంతే ... అదే తనకి తన అయ్య నేర్పిన చదువు .... అమ్మాయిగారికి ఎందరో డబ్బున్న బంధువులున్నారు, స్నేహితులున్నారు .... ఉంటే మాత్రం ....అమ్మాయి గారి మనసు ఎంత బాధపడిందో? ఎవరూ సమయానికి సహాయం చేయక పోతే!! .... రాజయ్యకి తన భార్య రాములమ్మ మెడలో మూడు తులాల గొలుసు, సూత్రం గొలుసు కనిపించింది కళ్ళకి ... తన కాలికి వున్న వెండి కడియం కనిపించింది. తన చిన్న కొడుకు వారం రోజులనాడు కొనిపెట్టిన రంగుల టివీ కనిపించింది కళ్ళకి .... ఇవన్నీ కలిపితే అమ్మాయిగారి కష్టం తీర్చలేవా?! .... రాజయ్య మనసు ఆనందంతో నిండిపోయింది. తను సాయం చేయగలడు. . . . . .

"రాంబాబూ! .... డబ్బు విషయం నే చూసుకుంటా. ఆ కాగితాలు వాటి విషయం నువ్వు చూసి పెట్టు .... ఆ సాయం నాకు చేయి చాలు. అమ్మాయిగారికి చెప్పాల్సిన అవసరం వుంటే చెప్పు .... లేకపోతే ఊరుకో. అమ్మాయిగారు ఒకరి రుణం వుంచుకోరు. సమయానికి సాయం...." రాజయ్య సైకిలెక్కి వెళ్ళిపోయాడు ఉత్సాహంగా.

నాన్నగారి కష్టార్జితం, ఎందరినో, ఎన్నో సందర్భాలలో కాపాడిన పెద్ద గొలుసు ఇంటికొచ్చేసింది.

"నాన్నగారూ! .... మ్రొక్కక వరమిచ్చే వేల్పులుకూడా వున్నారు ఈ లోకంలో ఇంకా." రాజ్యం మనసులో అనుకుంటూ, కాఫీ కప్పు అందించి, రాజయ్యకి నమస్కారం పెట్టింది.

"ఎందుకండీ .... తప్పు?" రాజయ్య సిగ్గుపడుతూ అమ్మాయిగారి వైపు చూస్తూ నవ్వాడు.

"చిన్నమ్మాయి పురిటికొస్తోందండీ! .... అల్లుడు వెంటబెట్టు కొస్తారుట రేపు..." రాజయ్య ఎంతో ఆనందంతో అన్నాడు.

అంతలోనే రాజయ్య కనుబొమలు ముడివడ్డాయి.

రాజ్యం గమనిస్తూనే వుంది.

"ఏమోనండీ! ఆ డాక్టరమ్మ చెప్పిందట.... కవలలు పుడతారట."

"ఏమిటీ?"

"అవునమ్మా! .... ఆడపిల్లలట .... భయంగా వుందమ్మా! ఏం పెట్టి పెంచుకుంటారో?" రాజయ్య ఎదురుగోడకున్న దేవుని పటానికి దణ్ణం పెట్టాడు.

"రాజయ్యా! ఒక పిల్లని నేను పెంచుకుంటా .... బెంగవడవద్దని చెప్పు నీ కూతురికి."

"అంతకంటె భాగ్యమా అమ్మా!" రాజయ్య ముఖం వికసించింది.

"అవును, నిజంగానే పెంచుకుంటా .... తప్పేమిటీ?" రాజ్యం మనసులో గట్టిగా నిశ్చయించుకొంది ఆ క్షణం.

కంటేనేనా పిల్లలూ!! ... రాజ్యం ఎటో చూస్తూ నవ్వుకుంది.